క్లుప్తంగా

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గంగాధర్

కడ్తాల్: శాంతియుత వాతావరణంలో పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ గంగాధర్ అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, రాజకీయ నాయకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా, ఎలాంటి సమస్య రాకుండా స్నేహ పూర్వక వాతావరణంలో పండుగ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ ఆంజనేయులు, నాయకులు జహంగీర్‌అలీ, హైమాద్ జానీ, వహాబ్, జానీమియా, యూసుఫ్, మహేశ్‌గౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి కాసుగుబావితండాకు చెందిన జగన్‌నాయక్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో బాధితుడికి ఆయన చెక్కు అందజేశారు. ఇదిలా ఉండగా.. మండల పరిధి కొండ్రిగానిబోడ్ తండాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ తండా వాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. నాయకులు బిక్కునాయక్, డాక్టర్ శ్రీను, యాదిలాల్, సుమన్ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరా అందజేత


కానిస్టేబుల్‌కు సీసీ కెమెరా అందజేస్తున్న దాత

కడ్తాల్: ఆలయంలో సీసీ కెమెరా ఏర్పాటుకు దాత ముందుకు వచ్చారు. మండల పరిధి న్యామతాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయానికి.. అదే గ్రామానికి చెందిన బోదాస్ మహేశ్ రూ.10 వేల విలువ చేసే సోలార్ సీసీ కెమెరా, సీసీటీవీ కెమెరాను కానిస్టేబుల్ మహేశ్‌కు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దాత మహేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ప్రభుత్వ కాలేజీలో చేర్పించండి


కళాశాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

ఆమనగల్లు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మీ పిల్లలను చేర్పించాలని వారి తల్లిదండ్రులను అధ్యాపకులు కోరారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని కళాశాల అధ్యాపకులు.. ఇంటింటి ప్రచారం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, మీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జైపాల్, నాగమణి, కృష్ణయ్య, లక్ష్మణ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో ముగ్గురు బాధితులకు మంజూరైన చెక్కులు అందజేశామన్నారు. మాజీ కార్పొరేటర్లు రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి

- ఆందోళన వద్దు.. దరఖాస్తు చేసుకోండి
- రెవెన్యూ సదస్సులో అధికారులు, నాయకులు
- రైతుల దరఖాస్తుల స్వీకరణ


ఆమనగల్లు: మాలెపల్లిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్ లలిత

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/ యాచారం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి చట్టం తెచ్చిందని అధికారులు, నాయకులు అన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం ఊరూరా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం నాలుగో రోజు రెవెన్యూ సదస్సులో పలువురు రైతుల నుంచి భూ సమస్యలపై తహసీల్దార్లు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందవద్దని, ఎలాంటి సమస్యలు ఉన్నా.. తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరిశీలన అనంతరం పరిష్కార మార్గం చూపుతామని స్పష్టంచేశారు.

ఇబ్రహీంపట్నంలో..

నెర్రపల్లి, రాయిన్‌గూడలో రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా ముగిశాయి. తహసీల్దార్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో నెర్రపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పది అర్జీలు వచ్చాయి. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో రాయిన్‌గూడలో కొనసాగిన సదస్సులో 26 దరఖాస్తులు అందాయి.

ఆమనగల్లులో..

రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని ఆమనగల్లు తహసీల్దార్ లలిత అన్నారు. మండల పరిధి మాలెపల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కొత్త చట్టంతో బాధితులకు మేలు జరగనుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంపత్‌కుమార్, ఏఆర్‌ఐ అబ్దుల్ అయూబ్, మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలోకి పోయి..

యాచారం మండల పరిధి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. చింతపట్లలో తహసీల్దార్ అయ్యప్ప, మల్కీజ్‌గూడలో ఉప తహసీల్దార్ కీర్తి సాగర్ రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. చింతపట్లలో 200, మల్కీజ్‌గూడలో 93 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. దళితుల ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూమిలో వెంటనే అర్హులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ.. సీపీఎం నాయకులు తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. లేని పక్షంలో తామే స్వాధీనం చేసుకుని, కబ్జాలోకి పోయి ఇళ్లు నిర్మించుకుంటామని పేర్కొన్నారు.


ఇబ్రహీంపట్నం: నెర్రపల్లిలో తహసీల్దార్ సునీతారెడ్డి


యాచారం: చింతపట్లలో తహసీల్దార్ అయ్యప్ప

ఆధునిక పద్ధతిలో అధిక దిగుబడి

- బిందు సేద్యంపై దృష్టి సారించాలి
- ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

కడ్తాల్: ప్రకృతిని పరిరక్షిస్తూ, ఆధునిక పద్ధతుల్లో అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ అనిత, డాక్టర్ స్వప్న శ్రీ, డాక్టర్ శిరీష, డాక్టర్ సుజాత అన్నారు. వ్యవసాయ శాఖ, విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని కర్కల్‌పహాడ్, సాలార్‌పూర్ గ్రామాల్లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రసాయన ఎరువులు వాడటంతో భూమి ఫలదాయకత తగ్గిపోవడమే కాకుండా.. నిస్సారమై బీడు భూములుగా మారే ప్రమాదముందని తెలిపారు. అలాంటి పరిస్థితులను అధిగమించేందుకు వర్మి కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు వాడటం ఉత్తమమని, జీలుగ, జనుము కలియదున్నడం ద్వారా భూసార పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. నీటి ఎద్దడి పెరుగుతుండటంతో, బిందు, తుంపర సేద్యంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఎరువులు, విత్తనాల కొనుగోలు రసీదులను భద్రపర్చుకోవాలని, తద్వారా ఆపత్కాలంలో సరైన నష్ట పరిహారం పొందవచ్చని తెలిపారు. అదే విధంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సాగులో మెలకువలు, నీటి యాజమాన్యం, భూసారం పెంపు, రసాయన ఎరువుల వాడకం, సాగు ఖర్చులు తగ్గించడం, పంట మార్పిడి, పర్యావరణ రక్షణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓలు అభినవ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కశ్యప్, అనూష, రైతులు మల్లయ్య, నర్సింహ, రవి పాల్గొన్నారు.


కడ్తాల్: కర పత్రాలను ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు

పంటల మార్పిడితో భూసారం పెంపు

ఇబ్రహీంపట్నం రూరల్: పంట మార్పిడి వలన భూసారం పెరిగి, పంటలు సమృద్ధిగా పండుతాయని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ రామ్‌ప్రకాష్, డాక్టర్ బి.పద్మజలు అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వరి సాగులో యూరియా వాడకం తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులను ఎక్కువగా ఉపయోగించాలని రైతులకు సూచించారు. పురుగు మందు అధికంగా వాడటం వలన భూసారం తగ్గిపోతుందని తెలిపారు. కలుపు మందుల వాడకంలో మెలకువలు, చెట్లపెంపకం, భూసార పరిరక్షణపై అవగాహన ఉండాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి విద్యాధరి, వివిధ శాఖల అధికారులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు మల్లురవి

ఎంపీపై అసత్య ప్రచారం చేస్తే సహించం: కాంగ్రెస్ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: రాజకీయాల్లో మచ్చలేని నాయకుడు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అని, ఆయన ఎదుగుదల చూసి ఓర్వలేక.. కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఆయన పని చేస్తున్నారని, పదవి ఉన్నా లేకపోయినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. పార్టీ అధిష్టానం ఆయనను గుర్తించి, కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చిందని చెప్పారు. దీనికి ఓర్వలేని అలంపూర్‌కు చెందిన కొందరు పార్టీ నాయకులు, కావాలనే గాంధీ భవన్‌లో ఎంపీపై, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అసత్య ఆరోపణలతో ఫిర్యాదు చేశారని, ఇలా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు మైసయ్య, ఖాదర్, శ్రీనునాయక్, రాఘవేందర్, మైసయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగం పేదలది.. పదవులు పెద్దలవి

ఇబ్రహీంపట్నం: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో 1200 మంది బీసీ,ఎస్సీ,ఎస్టీ నిరుపేద ప్రజలు ప్రాణత్యాగం చేస్తే.. పోరాట ఫలితంగా వచ్చిన రాష్ట్రంలో అగ్రకులాలు అధికారం చెలాయిస్తున్నాయని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తులసిగారి రవీందర్ విమర్శించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని అమరవీరుల స్థూపం వద్ద బీసీ, ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అణగారిన వర్గాలు అధికారం చేపట్టినప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ అమరవీరుల స్థూపాలు ఉన్నాయో, అక్కడ జేఏసీ అమరవీరుల స్థూపాలుగా నామకరణం చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే వారి ఆత్మలు శాంతిస్తాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రదీప్, భాస్కర్, భరత్‌గౌడ్, శ్రావణ్, రాము, లింగస్వామి, ఆనంద్‌లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల బారులు


బాలాపూర్ రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారుల పడిగాపులు

బడంగ్‌పేట్: రేషన్ దుకాణాల వద్ద తెల్లరేషన్ కార్డుదారులు బారులు తీరుతున్నారు. బాలాపూర్ మండల పరిధిలోని బడంగ్‌పేట, అల్మాస్‌గూడ, బాలాపూర్, మల్లాపూర్, వెంకటాపూర్, మామిడిపల్లి, నాదర్‌గుల్, గుర్రంగూడ, ప్రాంతాల్లో ఉన్న నిత్యవసరా దుకాణాల వద్ద ఎప్పుడు లేని విధంగా ఉదయం నుంచే క్యూ కడుతున్నారు. దీనికి తోడు మూడు నెలల రేషన్ కోసం మూడుసార్లు వేలిముద్రలు సేకరిస్తుండడంతో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు టేకుల శశిధర్‌రెడ్డి తెలిపారు. రేషన్ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది ఆరోగ్యమే ప్రధానం

- బడంగ్‌పేట కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: శానిటేషన్ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే కార్పొరేషన్ పరిశుభ్రంగా ఉంటుందని కమిషనర్ పి.సరస్వతి అన్నారు. వంద రోజుల ప్రణాళిక అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె బడంగ్‌పేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో శానిటేషన్ సిబ్బందికి, ఇతర సిబ్బందికి వైద్యపరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 300 మందికి పైగా ఉన్న శానిటేషన్ సిబ్బందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. వందరోజుల ప్రణాళికను విజయవంతం చేసి బడంగ్‌పేట కార్పొరేషన్‌ను జిల్లాలోనే గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యామ్ సుందర్, డీఈఈ వెంకన్న, ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ యాదగిరి, డివిజన్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ అవసరం

తుక్కుగూడ: పారిశుద్ధ్య కార్మికులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ వాణి సూచించారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం అయిన వారికి మందులు అందజేశారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సామిక్ కుమార్, ఆర్‌ఐ మల్లేష్, సిబ్బంది స్ఫూర్తి, ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- కాంగ్రెస్ నాయకులు
- ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం


ఆమనగల్లు: నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ మిత్రమండలి మండల అధ్యక్షుడు గంట నరేశ్ అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. విడతల వారీగా నిరుపేదల సొంతింటి కల ప్రభుత్వం నెరవేరుస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జగదీశ్వర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నర్సింహ, శ్రీశైలం, నర్సింహ, సురేందర్‌రెడ్డి, గోపయ్య ఉన్నారు.

ఆమనగల్లులో..

ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి చంద్రాయణపల్లి తండాలో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల సొంతింటి కలలను ప్రభుత్వ సాకారం చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనునాయక్, రాగ్యానాయక్, హర్యానాయక్, శంకర్‌నాయక్, బన్సిలాల్, మురళీనాయక్, శంకర్‌నాయక్, గోపాల్ నాయక్,సజ్జానాయక్, మాల్యానాయక్ పాల్గొన్నారు.


కడ్తాల్: మంజూరు పత్రం అందజేస్తున్న నాయకులు

ఆటస్థలం కేటాయించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇమామ్‌గూడ గ్రామస్తులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని ఇమామ్‌గూడ ప్రాథమిక పాఠశాలకు ఆటస్థలం కేటాయించాలని శుక్రవారం గ్రామస్తులు మహేశ్వరం తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలకు స్థలం లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని చెప్పారు. పాఠశాల మైదానానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీకుమారి, నాయకులు హరికృష్ణారెడ్డి, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధనలో రాజీ పడొద్దు

ఎంఈఓ పాండురంగారెడ్డి


ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

యాచారం: విద్యా బోధనలో ఉపాధ్యాయులు రాజీ పడొద్దని మండల విద్యాధికారి పాండు రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు.. మండల విద్యావనరుల కేంద్రంలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యతోనే ప్రజల్లో నమ్మకం కుదురుతుందని, సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా యాచారం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నర్సింహ గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి ప్రజలు సహకరించాలని, ఉచిత విద్య, భోజనం, పాఠ్య, నోటు పుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందని, తమ పిల్లలను చేర్పించాలని తల్లితండ్రులను కోరారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జంగయ్యయాదవ్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఇబ్రహీంపట్నంలోని ఓ గార్డెన్‌లో శుక్రవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోదాల శేఖర్‌రెడ్డి అధ్యక్షతన.. పార్టీ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల ఆశ పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలమైందని ఆరోపించారు. అవినీతి అక్రమాలతో గత ప్రభుత్వం.. ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల పరిపాలన ఎలా సాగిందో ప్రజలకు వివరిస్తూ.. వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. అనంతరం పార్టీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్, పొరెడ్డి అర్జున్‌రెడ్డిలు మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. పహల్గాం సంఘటన నేపథ్యంలో.. ఆపరేషన్ సిందూర్ ద్వారా విశ్వవ్యాప్తంగా శక్తివంతమైన దేశంగా భారత్ గుర్తించబడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దొండ రమణారెడ్డి, దండే శ్రీశైలం, బాలశివుడు, శ్రీనివాస్‌రెడ్డి, విఠల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కందుకూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మండల పరిధి గూడూరుకు చెందిన పి.రాజుముదిరాజ్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. దీంతో అతనితో పాటు కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1999- 2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బాల్య మిత్రులు ఏకమై.. రూ.50 వేలను మిత్రుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. అదే గ్రామానికి చెందిన మరో పూర్వ విద్యార్థి జహంగీర్‌పాషా రూ.20 వేల ఆర్థిక సహాయం చేయడంతో పాటు మృతుడి పిల్లల చదువుకు పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు.

ప్రభుత్వ నిర్ణయం విరమించుకోవాలి

మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఈఓ నర్సింలుకు వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజు మాట్లాడుతూ.. 23 ఏళ్లుగా కష్టనష్టాలకు ఓర్చుకుని వంట చేసిపెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పి, నేటికీ అమలు చేయకుండా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగించే పనులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి శ్రీనివాస్, అండాలు, బాలమణి, లక్ష్మమ్మ, రాణి, అలివేలు, సుజాత తదితరులు పాల్గొన్నారు.